భక్తులకు అసౌకర్యం కలగకూడదు



నెల్లూరు(బారకాసు): రొట్టెల పండగకు విచ్చేస్తున్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని జేసీ కూర్మనాథ్ ఆదేశించారు. దర్గా ప్రాంగణంలో ఏర్పాట్లను ఆర్డీఓ మలోలతో కలిసి ఆదివారం పరిశీలించిన అనంతరం జేసీ మాట్లాడారు. పండగకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగిందని చెప్పారు. నగరపాలక సంస్థతో పాటు ఇతర శాఖలు చేపట్టిన ఏర్పాట్లు, సేవలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. తొలుత దర్గా ప్రాంగణంలో పారిశుద్ధ్య చర్యలను కమిషనర్ వికాస్ మర్మత్ పరిశీలించారు. స్వర్ణాల చెరువు ఘాట్‌లో ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తాగునీరు, వైద్యసేవలను అందించడంలో చురుగ్గా ఉండాలని సిబ్బందికి సూచించారు.

పరిశుభ్రతే లక్ష్యంగా..

- మూడు షిఫ్టుల్లో పనిచేస్తున్న 840 మంది



నెల్లూరు(బారకాసు): నగరంలోని స్వర్ణాల చెరువులో నిర్వహిస్తున్న రొట్టెల పండగ సందర్భంగా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా నగరపాలక సంస్థ పటిష్ట ఏర్పాట్లు చేసింది. ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం రెండు.. తిరిగి రెండు నుంచి రాత్రి పది వరకు.. రాత్రి పది నుంచి ఉదయం ఆరు గంటల వరకు.. ఇలా మూడు షిఫ్టుల్లో దాదాపు 840 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఒక్కో షిఫ్టుకు 280 మంది చొప్పున పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. దర్గా ప్రాంగణంలో చెత్త కనిపిస్తే వీరు వెంటనే తొలగిస్తున్నారు. చెత్తాచెదారాన్ని మినీ ఆటోలు, ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. స్వర్ణాల చెరువులో భక్తులు రొట్టెలు మార్చుకునే సమయంలో చెత్తా చెదారం లేకుండా తొలగిస్తున్నారు.

భక్తజనసంద్రం



భక్తులతో కిక్కిరిసిన స్వర్ణాల చెరువు ఘాట్

- స్వర్ణాల చెరువుకు పోటెత్తిన భక్తులు

నెల్లూరు(మినీబైపాస్): రొట్టెల పండగను పురస్కరించుకొని నగరంలోని స్వర్ణాల చెరువుకు భక్తులు ఆదివారం పోటెత్తారు. తమ కోర్కెలు నెరవేరాలని కాంక్షిస్తూ రొట్టెలు పట్టుకునేందుకు పోటీపడ్డారు. విద్యుద్దీప కాంతులతో దర్గా ప్రాంగణం శోభిల్లింది. స్వర్ణాల చెరువులో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోటు షికారు కోసం పలువురు క్యూ కట్టారు.

ప్రపంచ శాంతి కోసం..



ప్రపంచ శాంతి కోసం రొట్టెను వదిలా. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆయురారోగ్యాలతో పాటు శాంతియుతంగా ఉండాలని కాంక్షిస్తూ ఇక్కడికి వచ్చి రొట్టెను వదిలా.

– ఖలీఫ్, చిత్తూరు జిల్లా

ఏర్పాట్లు బాగున్నాయి



ఏటా ఇక్కడికి వస్తున్నా. కోర్కెలన్నీ తీరుతున్నాయి. ఈసారి ఐశ్వర్య రొట్టెను పట్టుకున్నా. ఇక్కడ ఏర్పాట్లు చాలా చక్కగా ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది వసతులు మెరుగుపడ్డాయి.

– లావణ్య, నెల్లూరు

మొదటిసారొచ్చాం



ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి. ఆరోగ్య, గృహ రొట్టెను పట్టుకున్నాం. కుటుంబం మొత్తం వచ్చాం.

– కరిమున్నీసా, కడప

చదువు రొట్టెను పట్టుకున్నా



మా పాప బాగా చదువుకోవాలని కాంక్షిస్తూ రొట్టెను పట్టుకున్నా. రొట్టెల పండగకు ఏటా వస్తుంటాం.

– రాణి, బెంగళూరు



భక్తులకు ఆహారం అందజేత



వృద్ధురాలికి సేవలందిస్తూ..



బారాషహీదుల దర్శనానికి క్యూలో భక్తులు



దర్గా ప్రాంతంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు

విద్యుత్ శాఖ సీఈ ప్రత్యేక ప్రార్థనలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని బారాషహీద్ దర్గాను తెలంగాణ విద్యుత్ శాఖ చీఫ్ ఇంజినీర్ నందకుమార్ ఆదివారం దర్శించుకున్నారు. నెల్లూరు వాసినైన తాను ఏటా రొట్టెల పండగకు వస్తుంటానని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలు



రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

నెల్లూరు(బారకాసు): బారాషహీద్ దర్గా ప్రాంగణంలో వైద్య శిబిరాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలు 24 గంటలూ పనిచేస్తున్నాయి. భక్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేస్తున్నారు. రెడ్‌క్రాస్ సంస్థ, కిమ్స్, అపోలో, మెడికవర్, తదితర ఆస్పత్రుల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. వీటిని భక్తులు వినియోగించుకుంటున్నారు.

మహిళా పోరు యాత్ర పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మహిళా పోరు యాత్ర పోస్టర్లను బాలాజీనగర్‌లోని రామచంద్రారెడ్డి భవన్‌లో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మస్తాన్‌బీ, శివకుమారి మాట్లాడారు. దేశంలో మహిళలు, మైనర్లపై దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన జాతా ఆగస్ట్ ఒకటిన నగరానికి రానుందని తెలిపారు. ఐద్వా నెల్లూరు నగర, రూరల్ కార్యదర్శులు పద్మ, షాహినాబేగం, ప్రమీల, సుబ్బమ్మ, సంపూర్ణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధనలక్ష్మీపురంలో రక్తదాన శిబిరం

నెల్లూరు రూరల్: ధనలక్ష్మీపురంలో మెగా రక్తదాన శిబిరాన్ని హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్, నోవా బ్లడ్ బ్యాంక్ వారు సేకరించారు. సీనియర్ న్యాయవాది మలిరెడ్డి కోటారెడ్డి, గిరిధర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్, రవిప్రకాష్, ప్రసన్నాంజనేయులు, నాగేశ్వరరావు, చక్రవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సందర్శన

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న హయగ్రీవ ఉన్నత పాఠశాలను రాజ్యసభసభ్యుడు బీద మస్తాన్‌రావు ఆదివారం సందర్శించారు. ప్లే గ్రౌండ్, వసతులు, పరిశుభ్రత తదితరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీ వెంట పాఠశాల డైరెక్టర్ జిలుమూడి రమేష్‌రెడ్డి, ఎస్సై జి.సుబ్బారావు, సిబ్బంది మారుతి ప్రసాద్, తుమ్మలపెంట అహరోన్ ఉన్నారు.

ముదిరాజ్ నేతలకు సన్మానం

ఇందుకూరుపేట: ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి అమ్మవారిని రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కొర్నా వెంకట నారాయణరావు, ఎన్ఆర్ఐ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కోడి నారాయణరావు ఆదివారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత కోడి నారాయణరావును చైర్మన్ శాలువతో సత్కరించారు. ఆలయం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కోడూరు తీరంలో పర్యాటకుల సందడి

తోటపల్లిగూడూరు: కోడూరు బీచ్‌లో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండగకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి జనం విచ్చేస్తున్నారు. ఈ క్రమంలో అనేకమంది కోడూరు బీచ్ సందర్శిస్తున్నారు. పిల్లలు, యువత సముద్ర స్నానాలతో ఆనందంగా గడిపారు. సాయంత్రం 6 గంటల వరకు పర్యాటకులు వచ్చారు. సాగర తీరంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు

మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మనోజ్‌కుమార్ శర్మ పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకాలంకరణ అనంతరం కుంకుమపూజ జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రభుత్వోద్యోగులుగా గుర్తించరూ..



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(పొగతోట): గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)ను ప్రభుత్వోద్యోగులుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వోద్యోగుల ఫెడరేషన్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్‌రావు కోరారు. నగరంలోని ఏపీఆర్ఎస్ఏ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఫెడరేషన్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పనిచేస్తున్న 23 వేల మంది వీఆర్ఏల విద్యార్హతకు అనుగుణంగా పే స్కేల్‌ను అమలు చేసేలా చూడాలని కోరారు. ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ దేవిరెడ్డి రమణారెడ్డి, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల నేత హరీష్‌రెడ్డి, వీఆర్ఏల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, బాలరాజు, మల్లికార్జున్, వెంకటేశ్వర్లు, చాన్‌బాషా, సురేష్ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటాం



నెల్లూరు(బారకాసు): ఆపదలో ఉన్న వారికి పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సొసైటీ అండగా ఉంటుందని సంస్థ వ్యవస్థాపకుడు కోగిలి రమేష్‌రాజు పేర్కొన్నారు. అయ్యప్పగుడి సమీపంలోని డ్రైవర్స్ కాలనీలో నివసిస్తున్న లక్ష్మి కష్టాల్లో ఉందనే విషయం తెలుసుకున్న సంస్థ సభ్యులు ఆమె ఇంటికి ఆదివారం వెళ్లి టిఫిన్ దుకాణం కోసం అవసరమైన సామగ్రిని అందజేశారు. వరిపరివర్ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మాధవి సహకారాన్ని అందించారని చెప్పారు. సొసైటీ సభ్యులు అభిషేక్, సాయిరెడ్డి, అనిల్‌కుమార్, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు



మాట్లాడుతున్న ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్: గ్రామాల అభివృద్ధికి తన వంతు తోడ్పాటునందిస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పేర్కొన్నారు. నగరంలోని రూరల్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. రూరల్ మండలంలోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నానని చెప్పారు. ఆయా ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో వసతుల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని వివరించారు. వివిధ శాఖల్లో జరుగుతున్న పురోగతిని సమీక్షించారు. రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్, రూరల్ డిప్యూటీ తహసీల్దార్ గోపీ, వైస్ ఎంపీపీలు రవీంద్రరెడ్డి, దేవసేన, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ సమావేశం



శివమౌర్యను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): ఆచారివీధిలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు గుండ్లపల్లి శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఊపిరితిత్తుల వ్యాధి నిపుణుడు శివమౌర్య హాజరయ్యారు. ఊపిరితిత్తులపై పాటించాల్సిన జాగ్రత్తలు, ఆహార అలవాట్లు, షుగర్ వ్యాధి, తదితరాలపై అవగాహన కల్పించారు. అనంతరం శివమౌర్య, రోటరీ క్లబ్ నెల్లూరు మాజీ అధ్యక్షుడు విశ్వాన్ని సత్కరించారు. జూలైలో జన్మించిన అసోసియేషన్లోని 31 మందిని సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దెపల్లి సుబ్బారావు, సభ్యులు మురళీకృష్ణ, చిన్నిఈశ్వరయ్య, ప్రకాశ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రతిభ కార్యవర్గ ఎన్నిక

నెల్లూరు(బృందావనం): లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రతిభ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్లో ఆదివారం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా సత్యనారాయణ, లక్ష్మీనారాయణ, కోశాధికారిగా రూపేష్, ఉపాధ్యక్షులుగా సతీష్‌కుమార్, రాఘవేంద్రరావు, ఉప కార్యదర్శిగా రంగరాజు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్యఅతిథులుగా రీజినల్ చైర్మన్ శరత్‌బాబు, జోన్ చైర్మన్ నిఖిలేష్ హాజరయ్యారు. క్లబ్ ఫౌండర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

వెంకటేశ్వరపురంలోని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నెల్లూరు, పినాకినీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సునీల్‌బాబు, సురేంద్ర, కోశాధికారి అనిల్‌సాయికుమార్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నవాబుపేట రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలోని మైపాడు రోడ్డులో విద్యుత్ తీగలను మార్చనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సోమవారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోడిగాడితోట, వైకుంఠపురం, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ప్రతి నెలా ఆధ్యాత్మిక సేవలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పరిశుభ్ర కార్యక్రమాన్ని ప్రణవపీఠ శిష్యబృందం – గుడి – బడి నెల్లూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖ అడ్మిన్ మాలెపాటి నరేష్ మాట్లాడారు. మహాసహస్రావధాని వద్దిపర్తి పద్మాకర్ ఆదేశానుసారం ఆధ్యాత్మిక సేవలను ప్రతి నెలా నిర్వహించనున్నామని చెప్పారు. ఇందులో భాగంగా తల్పగిరి రంగనాథస్వామి ఆలయాన్ని 70 మందితో పరిశుభ్రం చేశామన్నారు. అనంతరం నిర్వాహకులకు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.

విద్యుత్ యూనియన్లతో రౌండ్ టేబుల్ సమావేశం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో పలు విద్యుత్ యూనియన్లతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, లేని పక్షంలో స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామరాజు, సీఐటీయూ కోశాధికారి లక్ష్మీనరసయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, నేతలు మునికృష్ణయ్య, హరినారాయణ, నాగయ్య, గిరి, అంకయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆవాజ్ నేతల నిరసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మణిపూర్ ఘటనను ఖండిస్తూ నిరసన కార్యక్రమాన్ని ఆవాజ్ నెల్లూరు కమిటీ ఆధ్వర్యంలో జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో ఆదివారం చేపట్టారు. ఆవాజ్ నగర కార్యదర్శి రియాజ్ అహ్మద్, కార్యవర్గ సభ్యులు రియాజ్, రవూఫ్, సమీవుల్లా, ఖాదర్‌బాషా, బాదుల్లా, ఖాదర్‌హుస్సేన్, ముజఫర్, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.